సాక్షి శ్రీకాకుళం

గురువారం । 27 । ఫిబ్రవరి । 2025



అంతా నా ఇష్టం

కోష్ట పంచాయతీలో మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు బరితెగించాడు. కృష్ణమ్మ చెరువు (కోనేరు) గట్టుపై మొక్కలు తొలగించి మట్టిని తరలించాడు. - 8లో

నేడు పాఠశాలలకు సెలవు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలలకు కలెక్టర్ ఆదేశాల మేరకు సెలవు ప్రకటించినట్లు డీఈఓ ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది భాగస్వాములు అవుతున్న నేపథ్యంలో లోకల్ హాలీడే కింద సెలవు పాటించాలని సూచించారు.



శ్రీకాకుళం కల్చరల్: నక్కవీధిలో ఉమాజఠలేశ్వర స్వామికి విశేష అలంకరణ



శ్రీకాకుళం గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వరునికి అభిషేకం

న్యూస్‌రీల్

పశువైద్యాధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాలకృష్ణ



డాక్టర్ బాలకృష్ణ

పొందూరు: మండల కేంద్రం పొందూరులోని పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ పీఎస్‌జీ బాలకృష్ణ రాష్ట్ర పశువైద్య అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. విజయవాడలోని డైరెక్టర్ కార్యాలయంలో జరిగిన ఎన్నికలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బాలకృష్ణ బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వెటర్నరీ జేడీ కె.రాజగోపాల్, జిల్లా పశువైద్యాధికారుల సంఘం, గోపాలమిత్రల సంఘం ప్రతినిధులు అప్పారావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

చక్రతీర్థ స్నానాలకు పక్కాగా ఏర్పాట్లు



అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

జలుమూరు: శ్రీముఖలింగంలో జరుగుతున్న శివరాత్రి ఉత్సవాలలో భాగంగా ఈ నెల 28న వంశధార నదిలో జరగనున్న స్వామివారి చక్ర తీర్థ స్నానాలకు పూర్తిస్థాయిలో బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి తెలిపారు. బుధవారం వంశధార నదిలో స్వామివారి చక్ర తీర్థ స్నానాల రేవు, పది మార్గాలను పరిశీలించారు. పోలీసులు, రోడ్లు భవనాల శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. నాలుగు లేయర్లతో ప్రతి 30 అడుగులకు ఐరన్ బారికేడ్లు, స్వామివారి పుణ్యస్నానాలు జరిగే చోట 60 అడుగుల పరిధిలో ఐరన్ జాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. స్వామివారిని నదికి తీసుకెళ్లే మార్గాన్ని శుభ్రం చేయించాలని సిబ్బందికి సూచించారు. బందోబస్తుకు సంబంధించి 50 రోప్ పార్టీలను వినియోగిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టెక్కలి డీఎస్పీ ఎ.ఎస్.ఎన్.వి.ఆర్ మూర్తి, సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు బంద్

శ్రీకాకుళం క్రైమ్, ఎచ్చెర్ల క్యాంపస్ : ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో జిల్లాలోని వివిధ బార్ అండ్ రెస్టారెంట్లు, మద్యం దుకాణాలు బుధవారం మూతపడ్డాయి. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ గోపాలకృష్ణ మాట్లాడుతూ బుధవారం, గురువారం డ్రై డేగా పాటిస్తున్నామన్నారు. షాపులను మూయించడమే కాకుండా శ్రీకాకుళం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మూడు కేసులు నమోదు చేసి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని (19 బాటిళ్లు) సీజ్ చేశామన్నారు. గురువారం పోలింగ్ సమయం ముగిసే వరకు డ్రై డేగానే పరి గణిస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా మద్యం సరఫరా చేసే ఎచ్చెర్లలోని ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ గోదాం సైతం మూసివేశారు. ఇక్కడి నుంచి షాపులకు మద్యం సరఫరా నిలిపివేశారు.

250 మందితో బందోబస్తు

శ్రీకాకుళం క్రైమ్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు జిల్లావ్యాప్తంగా 31 పోలింగ్ కేంద్రాల వద్ద 250 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తెలిపారు. ఎన్నికల అధికారులు, భద్రతా సిబ్బంది మినహా 100 మీటర్ల పరిధిలో ఎవరూ సెల్‌ఫోన్లు, వైర్లెస్ సెట్లు వినియోగించకూడదన్నారు.



జలుమూరు: శ్రీముఖలింగంలో పూజలందుకుంటున్న స్వామివారు



శ్రీకాకుళం కల్చరల్: భీమేశ్వరునికి అభిషేకాలు



టెక్కలి: రావివలస ఎండల మల్లికార్జునస్వామికి శీర్షాభిషేకాలు చేస్తున్న భక్తులు

జగములనేలే జగదీశా.. ధరణికి నువ్వే దరహాసా..

- మార్మోగిన పంచాక్షరి
- తరించిన భక్తఝురి
- మదినిండుగా మహాశివరాత్రి వేడుక



జలుమూరు: శ్రీముఖలింగంలో భక్తుల రద్దీ



పలాస: మహదేవిపురంలో స్వయం భూ లింగేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు

లింగోద్భవ వైభవం



ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలోని మధుకేశ్వరుని ఆలయంలో బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ క్రతువు శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ శాశ్వత ధర్మకర్త పర్లాకిమిడి యువరాణి కల్యాణ గజపతి వర్మ స్వామివారికి బంగారు పూలతో పూజ చేసి, అనంతరం శివలింగాన్ని బియ్యంతో అభిషేకించారు. తదుపరి పార్వతీ పరమేశ్వరులను గజ వాహనంపై ఊరేగించారు. -జలుమూరు

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పంచాక్షరీ మంత్రం ప్రతిధ్వనించింది. వాడవాడలా శివనామ స్మరణ మారుమోగింది. ముక్కంటి దర్శనానికి బుధవారం వేకువజాము నుంచే భక్తులు పోటెత్తడంతో శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. జిల్లాలోని శ్రీముఖలింగం, టెక్కలిలోని ఎండల మల్లికార్జున స్వామి ఆలయం, శ్రీకాకుళం నగరంలోని ఉమారుద్ర కోటేశ్వరాలయం తదితర ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిగాయి. – సాక్షి నెట్‌వర్క్

టీడీపీ నేతలకు ఎమ్మెల్సీ పరీక్ష

- ఏపీటీఎఫ్ అభ్యర్థి రఘువర్మ గెలుపును సవాల్‌గా తీసుకున్న పరిస్థితి
- ఓడిపోతే ప్రభుత్వంపై వ్యతిరేకత బయట పడుతుందని ఆందోళన
- సాధారణ ఎన్నికల మాదిరిగా పనిచేసిన మంత్రులు, నాయకులు
- ఉపాధ్యాయులపైనే ఆధారపడిన మిగతా అభ్యర్థులు
- నేడు పోలింగ్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక అధికార పార్టీ నేతలకు పరీక్షగా మారింది. గురువారం జరిగే ఈ ఎన్నిక మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు సవాల్‌గా పరిణమించింది. ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు టీడీపీ మద్దతు ప్రకటించడంతో ఆ అభ్యర్థికి చెందిన టీచర్ల సంఘం కంటే తెలుగుదేశం నేతలే ఎక్కువగా భుజాన వేసుకున్నారు. సాధారణ ఎన్నికల మాదిరిగా ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి ఓట్లు వేయమని అడగడమే కాకుండా అవసరమైన చోట ఒత్తిళ్లు, బెదిరింపులు, ప్రలోభాలకు గురి చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. మద్దతు ఇచ్చిన అభ్యర్థి ఓడిపోతే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందనేది బయటపడుతుందని పడరాని పాట్లు పడుతున్నారు. గతంలో ఎప్పుడూ ఇంటింటికీ వెళ్లి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగిన దాఖలాల్లేవు.



కానీ, మొదటిసారి టీడీపీ నాయకులు గ్రామ స్థాయి నుంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్లు ఉన్న ప్రతీ ఒక్కరికీ దగ్గరికి వెళ్లారు. ఎంత చేయాలో అంత చేశారు. ముఖ్యంగా ప్రైవేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ ఓట్లను తమవైపు తిప్పుకోవడానికి అన్ని రకాల శక్తియుక్తులు ఉపయోగించారు.

అసెంబ్లీ సమావేశాలు ఉన్నా..

అసెంబ్లీ సమావేశాలు ఉన్నప్పటికీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికను టీడీపీ నాయకులు తేలికగా తీసుకోలేదు. ఏ రోజుకారోజు సమావేశాలు ముగిసిన వెంటనే ఓటు హక్కు ఉన్న ఉపాధ్యాయులకు ఫోన్లు చేసి ఒత్తిడి చేశారు. ఇక, అసెంబ్లీ సమావేశాలు 27వ తేదీకి వాయిదా పడడంతో హుటాహుటిన ఎమ్మెల్యేలంతా తమ తమ నియోజకవర్గాలకు వచ్చి, సమావేశాలు పెట్టి, వ్యక్తిగతంగా టార్గెట్‌లిచ్చి ఇంటింటికీ పంపించారు. ఖర్చుకు వెనుకాడకుండా అన్ని రకాలుగా ప్రభావితం చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటును తమకు వేయాలని కొందరికి గట్టిగా చెప్పగా, మరికొందరికి మొదటి ప్రాధాన్యత ఓటుతో పాటు రెండో ప్రాధాన్యత ఓటు కూడా తాము చెప్పినోళ్లకే వేయాలని ఒత్తిడి తెచ్చారు. గెలుపు అవకాశాలు సానుకూలంగా లేకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓటును ఎవరికేయాలో అన్నది వ్యూహాత్మకంగా చెప్పుకొచ్చారు.

ప్రభుత్వ వ్యతిరేకతపైనే నమ్మకం..

పీఆర్‌టీయూ తరఫున పోటీ చేస్తున్న గాదె శ్రీనివాసులునాయుడు కోసం పలు ఉపాధ్యాయ సంఘాలు పనిచేయగా, పీడీఎఫ్ తరఫున పోటీ చేస్తున్న విజయగౌరీ కోసం మరికొన్ని ఉపాధ్యాయ సంఘాలు పనిచేశాయి. తమకు సానుకూలంగా ఓటర్లను కూడగట్టుకున్నారు. ఉపాధ్యాయులే భుజాన వేసుకుని ఆద్యంతం పనిచేశారు. తమ సంఘం అభ్యర్థి గెలుస్తారని అటు పీఆర్‌టీయూ, ఇటు పీడీఎఫ్ ఎవరికివారు అంచనా వేసుకుంటున్నారు. ఓటర్లు అంతా విద్యావంతులని, విద్యాబుద్ధులు నేర్పే గురువులని, ఎవరి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు వేస్తారని, వారి పక్షాన నిలబడే నాయకులకు తప్ప స్వార్థ రాజకీయాలు చేసే నాయకులను ఎన్నుకోరని, గెలుపు విషయంలో తమకు క్లారిటీ ఉందని ధీమాగా ఉన్నారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతే తమను గెలిపిస్తుందని ఇరువురు ఆశతో ఉన్నారు. ఉపాధ్యాయులు తమ డిమాండ్ల సాధనకు పాటుపడే అభ్యర్థులకు ఓటేస్తారో.. లేదంటే నేతలకు ఒత్తిళ్లకు తలొగ్గి ఓటేస్తారో.. వేచి చూడాల్సిందే.

ఎదురొచ్చిన మృత్యువు

- గ్యాస్ బండిని ఢీకొట్టిన ద్విచక్ర వాహనం
- పేలిన బైక్ ట్యాంకర్
- ఇద్దరు యువకుల దుర్మరణం
- తీవ్ర గాయాలపాలైన మరో యువకుడు
- ఒడిశాలో ప్రమాదం..కవిటి మండలంలో విషాదం

ఇచ్ఛాపురం రూరల్/బరంపురం: ఒడిశా రాష్ట్రం చీకటిపేట రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కవిటి మండలానికి చెందిన ఇద్దరు యువకులు మృత్యువాత పడగా, మరో యువకుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనతో కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. కవిటి మండలం బెజ్జిపుట్టుగ గ్రామానికి చెందిన తుపాకి రాజు (20), రాజపురం తొత్తిడి పుట్టుగ గ్రామానికి చెందిన పాడియా లక్ష్మణరావు (22), సీహెచ్.నరేంద్ర స్నేహితులు. రాజు ఇటీవల కొనుగోలు చేసిన బైక్‌పై తన ఇద్దరు స్నేహితులతో కలిసి ఒడిశా రాష్ట్రం చీకటి పాత్రపురం సమీపంలోని ఓ గ్రామంలో స్నేహితుడి వివాహానికి మంగళవారం వెళ్లారు. అదే రోజు సాయంత్రం ఇంటికి వస్తుండగా చీకటి రోడ్డులో తాళపడ నోగాం సమీపంలో ఎదురుగా వస్తున్న గ్యాస్ సిలిండర్ల వాహనాన్ని ఢీకొట్టారు.



తుపాకి రాజు(ఫైల్)



లక్ష్మణరావు(ఫైల్)



కాలిపోతున్న బైక్, రాజు మృతదేహం

బైక్ పెట్రోల్ ట్యాంకు ఒక్కసారిగా పేలిపోవడంతో డ్రైవింగ్ చేస్తున్న రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న లక్ష్మణరావు, తీవ్ర గాయాలపాలైన నరేంద్రలను అటువైపుగా వెళ్తున్న వాహనదారులు ఆసుపత్రికి తీసుకు వెళ్తుండగా, లక్ష్మణరావు మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన నరేంద్ర బరంపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాజు తండ్రి లోకనాథం మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, తల్లి జానకమ్మ, చెల్లిని పోషించుకునేందుకు కవిటిలోని ఓ సర్వీసింగ్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. లక్ష్మణరావు, నరేంద్రల తల్లిదండ్రులు వలస కూలీలు. బరంపురం ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తయ్యాక మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.



బ్యాలెట్ బాక్సును పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ నేడే

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం

శ్రీకాకుళం పాతబస్టాండ్:

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సర్వం సిద్ధమైంది. గురువారం జరిగే ఈ ఎన్నికల బరిలో 10 మంది ఉన్నప్పటికీ ప్రధాన పోటీ ముగ్గురు మధ్యే ఉంది. పీఆర్‌టీయూ తరఫున గాదె శ్రీనివాసులునాయుడు, పీడీఎఫ్ తరఫున యూటీఎఫ్ మద్దతుతో కోరెడ్ల విజయగౌరీ, ఏపీటీఎఫ్ తరఫున పాకలపాటి రఘువర్మ(సిట్టింగ్ ఎమ్మెల్సీ) పోటీ పడుతున్నారు. మిగతా ఏడుగురు స్వతంత్ర అభ్యర్థులు. ఉత్తరాంధ్ర పరిధిలో 123 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ జరగనుంది. 22,488 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో 13,503 మంది పురుషులు, 8,985 మంది మహిళలు ఉన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో ఎన్నిక జరుగుతుంది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో



శ్రీకాకుళం ఆర్డీఓ కార్యాలయం వద్ద ఎన్నికల సామగ్రి తీసుకెళ్లేందుకు వచ్చిన సిబ్బంది

స్కూల్ అసిస్టెంట్లు, ప్రభుత్వ, ఎయిడెడ్ కాలేజీ అధ్యాపకులు, ప్రైవేటు కాలేజీ, హైస్కూల్స్‌లో పనిచేస్తున్న టీచర్లు ఓటర్లుగా ఉన్నారు.

సామగ్రి సరిచూసుకోవాలి: కలెక్టర్

ఎన్నికల సామగ్రిని ముందుగానే సరిచూసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సిబ్బందికి సూచించారు. బుధవారం శ్రీకాకుళం ఆర్డీఓ కార్యాలయం ఆవరణలో పోలింగ్ మెటీరియల్ పంపిణీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెటీరియల్ పంపిణీ చేసిన స్థలంలోనే పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులు తిరిగి అప్పగించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.సాయి ప్రత్యూష, జిల్లా సహాయ ఎన్నికల అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు ఎలక్షన్ డీటీలు, సిబ్బంది పాల్గొన్నారు.


జిల్లాలో ఓటర్ల సంఖ్య	పోలింగ్ కేంద్రాలు	పోలింగ్ సమయం	ఓట్ల లెక్కింపు
5,035	31	ఉదయం 8 నుంచి సాయంత్రం 4	మార్చి 3

దీపమే..శాపమైంది!

- కొండవూరులో అగ్నిప్రమాదం
- కాలిపోయిన రూ.1.15 లక్షల నగదు
- బూడిదైన మూడు తులాల బంగారం, వెండి

వజ్రపుకొత్తూరు:

ఆ కుటుంబానికి దీపమే శాపమైంది. కష్టార్జితాన్నంతా బూడిద చేసింది. వజ్రపుకొత్తూరు మండలం కొండవూరుకు చెందిన అడ్డి రమణ, విమల దంపతులు బుధవారం మహా శివరాత్రి పర్వదినాన ఇంట్లో దేవుడికి దీపం వెలిగించి శివాలయానికి వెళ్లారు. తిరిగి వచ్చే లోగా అగ్ని ప్రమాదం సంభవించడంతో తీరని నష్టం వాటిల్లింది. అప్పు తీర్చేందుకు తెచ్చిన రూ.1.15 లక్షల నగదు కాలిపోయింది. మూడు తులాల బంగారం, వెండి, విలువైన పత్రాలు, ఎల్ఐసీ పాలసీ బాండ్లు, దుస్తులు, ఇతర సామగ్రి బూడిదైపోవడంతో బాధితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



కాలిపోయిన నగదు

రోదిస్తున్న బాధితుడు రమణ

కష్టార్జితం కాలిపోయింది..

మంకినమ్మ దాసుడైన అడ్డి రమణ.. కౌలు రైతు. భార్యాబిడ్డలతో కలిసి రేకుల ఇంట్లోనే నివాసముంటున్నాడు. గ్రామంలో ఓ వ్యక్తికి లక్ష రూపాయలు బాకీ ఉండటంతో గేదెలు అమ్మాడు. రూ.1.15 లక్షలు రావడంతో ఇంటిలోని దేవుడి మూల దాచిపెట్టాడు. రేపోమాపో అప్పు తీర్చుదామనుకోగా ఇంతలో ప్రమాదం జరగడడంతో లబోదిబోమంటున్నాడు. కాగా, ఈ ప్రమాదంలో కొంత సొమ్ము పాక్షికంగా కాలిందని, బ్యాంక్ అధికారులు స్పందించి చెల్లుబాటయ్యేలా చూసి బాధితుడిని ఆదుకోవాలని గ్రామ సర్పంచ్ కొల్లి భాస్కరరావు కోరారు. ఇదే విషయాన్ని వీఆర్‌ఓ, తహసీల్దార్, పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.



లారీ..మరోసారి!

ఎచ్చెర్ల మండలం కింతలి మిల్లు సమీపంలో జాతీయ రహదారిపై డివైడర్ ప్రమాదాలకు కేంద్ర బిందువుగా మారుతోంది. ప్రతిసారీ లారీ డివైడర్‌పైకి దూసుకురావడం.. గ్రిల్స్ అన్నీ విరిగిపోవడం.. తిరిగి అమర్చడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది. ఇదే క్రమంలో బుధవారం కూడా టెక్కలి నుంచి విశాఖపట్నం వైపు గ్రానైట్ రాయితో వెళ్తున్న లారీ డివైడర్‌పైకి ఎక్కడంతో ఇనుప గ్రిల్స్ 50 మీటర్ల వరకు ధ్వంసమయ్యాయి. అదృష్టవశాత్తు లారీ డ్రైవర్, క్లీనర్‌కు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. - ఎచ్చెర్ల క్యాంపస్



క్లుప్తంగా

పీసీఎంఏ ఎన్నికలకు నామినేషన్లు



నామినేషన్లు వేస్తున్న సభ్యులు

కాశీబుగ్గ: పలాస కాష్యూ మ్యానుఫాక్చర్ అసోసియేషన్ (పీసీఎంఏ) నూతన కార్యవర్గ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. పలాసలో ఉన్నటువంటి పీసీఎంఏ కార్యాలయంలో ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. కాగా బుధవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. అధ్యక్ష పదవికి పూర్వపు అధ్యక్షుడు మల్లా శ్రీనివాసరావు, కార్యదర్శి స్థానానికి టంకాల రవిశంకర గుప్తా, చుండూరు మహేశ్వరరావు, కోశాధికారి స్థానానికి సిందిరి సతీష్‌కుమార్‌లు నామినేషన్ దాఖలు చేశారు. 28వ తేదీన నామినేషన్ల విత్‌డ్రాకు అవకాశం ఉంటుంది. మార్చి 4వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు.

మత విద్వేషాలను అరికట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాలోని ఇచ్ఛాపురం మండలం డొంకూరు గ్రామంలో మత విద్వేషాలను అరికట్టాలని ఆ గ్రామానికి చెందిన క్రైస్తవులు కోరారు. ఈ మేరకు జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి ఆర్‌ఎస్ జాన్‌కు వినతిపత్రం బుధవారం అందజేశారు. కొంతమంది వ్యక్తులు హిందూవులు, క్రైస్తవుల మధ్య విభేదాలను సృష్టిస్తున్నారని తెలియజేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై స్పందించిన జాన్ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తానని పేర్కొన్నారు.

గంజాయితో ముగ్గురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న టెక్కలి డీఎస్పీ మూర్తి

పాతపట్నం: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు పాతపట్నం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో టెక్కలి డీఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి బుధవారం సాయంత్రం వివరాలు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం తిరుచురాపల్లి జిల్లాకు చెందిన మోహన్‌రాజ్ పరిమళ్, శక్తివేల్ కృష్ణన్, గౌతం సెంథిల్ కుమార్‌లు ఒడిశాలోని మునిగుడలో ఒక దివ్యాంగుడి వద్ద 20.085 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. ఈ గంజాయిని 11 ప్యాకెట్లుగా తయారుచేసి మూడు బ్యాగుల్లో సర్దారు. అనంతరం గంజాయిని పాతపట్నం మీదుగా తరలించేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చారు. అయితే ఎస్ఐ బి.లావణ్యకు ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు ఉదయం 11 గంటల సమయంలో కాంప్లెక్స్‌లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఈ ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి ముఠాను పట్టుకోవడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన పాతపట్నం సీఐ, ఎస్ఐ, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి అభినందించారు.

బుడితిలో ఆటో చోరీ

సారవకోట: మండలంలోని బుడితి బస్టాండ్‌లో మంగళవారం రాత్రి ఆటో చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నేతింటి చలపతి ప్రతీరోజు మాదిరిగానే ఆటోను బుడితి బస్టాండ్‌లో పార్కింగ్ చేసి ఇంటికి వెళ్లిపోయాడు. బుధవారం తెల్లవారుజామున వెళ్లి చూసేటప్పటికి ఆటో లేకపోవడంతో చుట్టూ గాలించి సారవకోట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై హెచ్‌సీ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూగ రోదన..!

- పశు అంబులెన్స్‌లకు మంగళం
- కాంట్రాక్ట్ ముగిసిందనే నెపంతో నిలుపుదల
- ఆవేదన వ్యక్తం చేస్తున్న పాడి రైతులు
- రోడ్డునపడిన సిబ్బంది



1962 పశు అంబులెన్స్ వాహనం


కాశీబుగ్గ:

పశువులకు ఏదైనా జబ్బు చేస్తే.. పశు వైద్యశాలకు తీసుకెళ్లడం కష్టతరమైనపని. భారీగా ఉండే పశువులను వాహనాల్లో సుదూర ప్రాంతాల్లో ఉండే డాక్టర్ల వద్దకు తరలించడం ఎంతో వ్యయ, ప్రయాసలతో కూడుకున్నది. దీంతో పాడి రైతుల ఇబ్బందులు తొలగించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ పథకాన్ని తీసుకొచ్చింది. దీనిలో భాగంగా మొబైల్ వెటర్నరీ క్లినిక్‌లు అందుబాటులోకి వచ్చాయి. దీనికోసం 1962 హెల్ప్‌లైన్ నంబర్ కేటాయించారు. రైతుల నుంచి ఫోన్ వచ్చిన వెంటనే 108 అంబులెన్స్ మాదిరిగానే, 1962 పశు అంబులెన్స్‌లు వెళ్లి రైతుల ఇంటి వద్ద మూగజీవాలకు వైద్య సేవలు అందజేసేవి. మరింత ప్రమాదకర స్థితిలో ఉన్నప్పుడు అంబులెన్స్ ద్వారా సమీప అస్పత్రికి తీసుకెళ్లి వైద్య సేవలు అందించేవారు. అయితే వారం రోజులుగా 1962 హెల్ప్‌లైన్ నంబర్ మూగబోయింది. మొబైల్ వెటర్నరీ క్లినిక్‌లు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. మారుమూల పల్లెల్లో సైతం అందించే విశిష్ట పశువైద్య సేవలు నిలిచిపోయాయి. ఎన్నో అరుదైన శస్త్రచికిత్సలు చేసి మూగజీవాలకు ప్రాణదానం చేసిన మొబైల్ అంబులెన్సులు రోడ్డెక్కడం లేదు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 10 అంబులెన్సులు నిలిచిపోగా.. రేపో మాపో మిగిలిన 9 అంబులెన్సు కూడా ఆగిపోనున్నాయి.

జిల్లాలో పశువుల సంఖ్య	
ఆవులు	57,1943
గేదెలు	48,481
గొర్రెలు	7,38,910
మేకలు	3,35,684
పందులు	3,092

కక్షగట్టిన కూటమి ప్రభుత్వం

ఉన్నత ఆశయంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1962 అంబులెన్సులపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. కాంట్రాక్టు ముగిసిందనే నెపంతో 10 అంబులెన్స్‌లను ఈనెల 16 నుంచి నిలిపివేసింది. మరికొన్ని రోజుల్లో మిగిలిన వాటిని సైతం ఆగిపోవాలని సూచించినట్లు తెలుస్తోంది. అయితే ఉన్నపళంగా సేవలను నిలిపివేయడంపై పాడి రైతులు మండిపడుతున్నారు. మూగజీవాల వైద్య సేవలకు అంతరాయం ఏర్పడుతోందని వాపోతున్నారు. మరోపక్క 1962 అంబులెన్సులో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బంది పరిస్థితి కూడా అగమ్యగోచరంగా మారింది. కొత్త సంస్థతో ఒప్పందం కుదరకపోతే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. తమకు రావాల్సిన బకాయిల సంగతి తేల్చకుండా, కూటమి సర్కారు వ్యవహరిస్తున్న తీరుపై మండిపడుతున్నారు.



GOVERNMENT OF ANDHRA PRADESH
DIRECTORATE OF ANIMAL HUSBANDRY: AP: VIJAYAWADA

Sub: Animal Husbandry Department – Sanchara Pasu Seva Kendram – ...

M/s. GVK-EMRI being the service provider for Operation and Maintenance of the 340 MAVC vehicles in two phases in the state as shown below:

Sl. No	Phase	No of MAVCs	O & M Period (For 2 years) From	To
1	I Phase	175	19.05.2022	18.05.2024
2	II Phase	165	18.02.2023	17.02.2025

వాహనాలు నిలిపివేయాలని విడుదల చేసిన ఆదేశాలు

మంత్రికి విన్నపం

1962 అంబులెన్సుల్లో పనిచేసేవారి కుటుంబాలు రోడ్డున పడకుండా ఆదుకోవాలని సిబ్బంది కోరుతున్నారు. ఈ మేరకు పశువైద్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిని ఇటీవల కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే జిల్లా అధికారిని కలిసి ముందస్తు సమాచారం లేకుండానే నిలిపివేయడంతో తమ కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. తమకు రావాల్సిన బకాయిలు చెల్లించడంతో పాటు సంస్థ మారినా మళ్లీ తమను విధుల్లోకి తీసుకునేలా చూడాలని కోరారు.



జిల్లాలో నిలిచిపోయిన వాహనాలు

రోడ్డునపడ్డాం



నేను జిల్లా కేంద్రంలో 1962 అంబులెన్సు ప్రారంభం నుంచి పనిచేస్తున్నారు. నా కుటుంబం నా ఉద్యోగం పైనే ఆధారపడి ఉంది. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఒక్కసారిగా మమ్మల్ని తీసేయడంతో రోడ్డున పడ్డాము. మా జీవితాలు గురించి ఆలోచించి, తక్షణమే ప్రభుత్వం మమ్మల్ని తిరిగి విధుల్లోకి తీసుకోవాలి. – సంతోష్ కుమార్, అంబులెన్స్ పైలెట్, శ్రీకాకుళం

జీతం డబ్బులు ఇవ్వలేదు



నేను పాతపట్నం, కొత్తూరు, కోటబొమ్మాళి మండలాల్లో రిలీవర్‌గా పనిచేశాను. ఇప్పటివరకు రెండుసార్లు మాత్రమే రూ.18 వేల జీతం పడింది. ఇప్పుడు నన్ను ఉండిపోమ్మని చెబుతున్నారు. నాకు రావాల్సిన జీతం ఇవ్వలేదు సరికదా తిరిగి నాకు ఖర్చులు అయ్యాయి. ప్రభుత్వం స్పందించి నాకు రావాల్సిన బకాయిలు అందించాలని కోరుతున్నాను. – సింహాచలం, రిలీవర్, పాతపట్నం



ఒక రైతు ఇంటి వద్ద దూడకు వైద్యం చేస్తున్న సిబ్బంది (ఫైల్)

వాట్సాప్‌లో తెలిపారు



నేను ఎచ్చెర్ల మండలంలో విధులు నిర్వహిస్తున్నాను. ఇటీవల వాట్సాప్‌లో మెసేజ్ చేసి విధులకు హాజరవ్వొద్దని చెప్పారు. ఇప్పుడు మేము రోడ్డున పడ్డాము. ఒక్క వాట్సాప్ మెసేజ్‌తో ఉండిపోండి అంటూ చెప్పిన తీరు ఆశ్చర్యానికి గురి చేసింది. ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి. – ఇప్పిలి లక్ష్మీనారాయణ, పైలెట్, ఎచ్చెర్ల

అంతా నా ఇష్టం

- కోష్టలో టీడీపీ నాయకుడి బరితెగింపు
- చెరువు గట్టుపై మట్టి దోపిడీ
- రెండు రోజులుగా జేసీబీ, ట్రాక్టర్లతో తరలింపు
- ఎన్‌ఆర్‌జీఎస్‌లో నాటిన కొబ్బరి మొక్కలు తొలగింపు

టీడీపీ నాయకులు దేనిని వదలడం లేదు. ఓ వైపు ఇసుక.. మరో వైపు మట్టి..ఇలా కన్నుపడితే చాలు ఖాళీ చేసేస్తున్నారు. కరకట్టలు.. చెరువుగట్టులు ఇలా వేటినీ విడవడం లేదు. నిబంధనలు తమకు వర్తించవని ప్రకృతి వనరుల విధ్వంసానికి పాల్పడుతున్నారు. అడిగితే అంతా మా ఇష్టమన్నట్లు వ్యవహరిస్తున్నారు.



జేసీబీతో చెరువు గట్టును తొలుస్తున్న దృశ్యం



ట్రాక్టర్‌తో మట్టి తరలింపు

రణస్థలం: మండలంలోని కోష్ట పంచాయతీలో మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు పిసిని జగన్నాథం బరి తెగించాడు. గ్రామంలోని కృష్ణమ్మ చెరువు(కోనేరు) గట్టుపై మట్టిని ఇష్టానుసారంగా రెండు రోజులు పాటు తరలించాడు. స్థానికులు, గ్రామ పెద్దలు తెలిపిన వివరాల మేరకు.. పంచాయతీలోని కృష్ణమ్మ చెరువు గట్టుపై ఎన్ఆర్ఈజీఎస్ పనుల్లో భాగంగా కొబ్బరి మొక్కలు పెంచుతున్నారు. ఈ చెరువుపై ఆధారపడి వందలాది మంది రైతులు వ్యవసాయం సాగిస్తున్నారు. అయితే ఇటువంటి చెరువు గట్టుపై టీడీపీ నాయకుడు పిసిని జగన్నాథం కన్నుపడింది. దీంతో మంగళవారం రాత్రి నుంచి రెండు రోజులు పాటు నిర్విరామంగా ఒక జేసీబీ, మూడు ట్రాక్టర్లతో చెరువు గట్టుపైన మట్టిని తరలించేశాడు. గట్టుపై ఉన్న సుమారు 30కు పైగా కొబ్బరి మొక్కలను పీకిపడేశాడు. విషయం తెలిసిన వెంటనే గ్రామ సర్పంచ్ పిసిని చిన్నంనాయుడు మట్టి తరలింపు చర్యలు నిలిపివేయాలని చెప్పినా పట్టించుకోలేదు. తదుపరి ఆ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ఆకుల సూర్యనారాయణ చెప్పినా చెవికెక్కించుకోలేదు. చివరకు అధికారులు చెప్పినా తనపని తాను చేసుకుపోయాడు. ఇంతమంది చెప్పినా వినకుండా బరితెగించడంపై గ్రామస్తులు, చెరువుపై ఆధారపడిన రైతులు విస్తుపోయారు. ఈ విషయంపై ఆ గ్రామ రెవెన్యూ అధికారి లుకలాపు అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి ఆర్.శ్రీధర్‌ను వివరణ కోరగా గురువారం చెరువును పరిశీలిస్తామన్నారు.



చెరువు గట్టుపై కొబ్బరి మొక్కలు తొలగించిన దృశ్యం

వేధింపులు తాళలేకే..!

- భర్తను చంపిన భార్య
- వీడిన మర్డర్ మిస్టరీ

శ్రీకాకుళం క్రైమ్: నిత్యం మద్యం సేవించి ఇంటికొచ్చి వేధించడమే కాకుండా, అక్రమ సంబంధాన్ని అంటగట్టడంతో పాటు పిల్లలను సైతం కొట్టడంతో భరించలేకే తన భర్తను చున్నీతో మెడకు చుట్టేసి చంపేశానని మజ్జి శశి అనే వివాహిత పోలీసుల ముందు ఒప్పుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల జిల్లా కేంద్రంలోని బలగ టీ ఏజెంట్ కాలనీలో మజ్జి రమేష్ (35) అనే యువకుడు తన అద్దె ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందిన సంగతి పాఠకులకు విదితమే. విచారణాధికారిగా ఉన్న రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి రెండు రోజుల్లోనే ఛేదించారు. దీనికి సంబంధించిన వివరాలను శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద బుధవారం మధ్యాహ్నం తమ కార్యాలయంలో వెల్లడించారు.

జరిగింది ఇదీ...

బలగ హడ్కో కాలనీ సమీప టీ ఏజెంట్ కాలనీలో నివాసముంటున్న రమేష్ స్క్రాప్ షాపులో పనిచేస్తుండేవాడు. ఇతనికి ఒడిశాలోని రాయగడ జిల్లా బిసింగిటక్ మండలం దుకుము గ్రామానికి చెందిన శశితో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి 12 ఏళ్ల పాప జ్యోత్స్న, పదేళ్ల బాబు వెంకటసాయి ఉన్నారు. రమేష్ మద్యానికి బానిసై నిత్యం భార్యను తరచూ అనుమానించి, గొడవపడి చిత్రహింసలకు గురిచేసేవాడు. దీంతో ఆమె ఇదివరకే పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే పెద్దలు, ఇరుపక్కల కుటుంబసభ్యులు రాజీ కుదర్చడం చేసేవారు. కాగా ఈనెల 24వ తేదీన ఉదయం రమేష్ హడ్కో కాలనీలో ఉంటున్న తన తల్లి వద్దకు వెళ్లి కొంత డబ్బులు, బియ్యం తీసుకుని మద్యం సేవించి ఇంటికొచ్చాడు. వచ్చీరావడంతోనే పిల్లలను అకారణంగా కొట్టడంతో భార్య శశి అడ్డుకుని పిల్లలేం తప్పు చేశారంటూ నిలదీసింది. దీంతో ఆమెను కొట్టడం ఆరంభించాడు. అక్కడికి కాసేపయ్యాక పిల్లలు స్కూలుకు వెళ్లిపోవడంతో భర్త చిత్రహింసలకు విసిగిపోయిన శశి, చున్నీతో మెడను చుట్టి గట్టిగా లాగేయడంతో రమేష్ ప్రాణాలు విడిచాడు. అనంతరం కేసు నుంచి తప్పించుకునే ప్రయత్నంలో అత్త విజయ వద్దకు వెళ్లి తలుపులు ఎంత తీయమన్నా తీయడం లేదంటూ తెలిపింది. ఆమెను వెంటబెట్టుకు వచ్చి సైడ్ తలుపులు తీసి లోపలికి వెళ్లి చూపించింది. అయితే కొడుకు చనిపోవడాన్ని చూసి కోడలే చంపేసి ఉంటుందన్న అనుమానాన్ని పోలీసుల ముందు చెప్పడంతో సీఐ ఈశ్వరరావు, క్లూస్ టీమ్ సహాయంతో మృతదేహాన్ని పరిశీలించారు. మెడ భాగంలో ఎరుపు మచ్చలా ఉండటం పోస్టుమార్టం నిమిత్తం పంపించారు. మంగళవారం వచ్చిన పోస్టుమార్టం నివేదికలో మెడను గట్టిగా అదిమినట్లు ఉందని రావడంతో హత్యగానే నిర్ధారించి నిందితురాలైన శశిని విచారించగా మధ్యవర్తుల సమక్షంలో నిజం ఒప్పుకుంది. దీంతో కేసును రెండు రోజుల్లోనే ఛేదించిన విచారణాధికారి రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు, హెచ్‌సీ ఎస్.శివాజీ, పీసీ బి.రమేష్, మహిళా పీసీ జి.ఢిల్లీశ్వరిని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ప్రశంసించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద, పక్కనే సీఐ ఈశ్వరరావు

సీబీసీఎన్‌సీ ఆస్తులను పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న ట్రస్టు చైర్మన్ ఆర్‌ఎస్ జాన్

శ్రీకాకుళం కల్చరల్: ది కన్వెన్షన్ ఆఫ్ ది బాప్టిస్టు చర్చస్ ఆఫ్‌ది నార్తన్ సర్కాస్ (సీబీసీఎన్‌సీ) ఆస్తులు పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని విజయనగరం సీబీసీఎన్‌సీ ట్రస్టు చైర్మన్ ఆర్.ఎస్.జాన్ అభిప్రాయపడ్డారు. నగరంలోని తెలుగు బాప్టిస్టు చర్చిలో విలేకరుల సమావేశం బుధవారం నిర్వహించారు. సీబీఎం మిషన్‌కు సోంపేట నుంచి అవనిగెడ్డ వరకు అనేక బాప్టిస్టు సంఘాల పేరిట ఆస్తులను ఉన్నాయన్నారు. 1979లో సీబీసీఎన్‌సీలో వివాదాలు ఏర్పడి అనేే సంఘాలుగా విడిపోయాయని గుర్తు చేశారు. దీనిని ఆసరాగా తీసుకొని కొందరు బాప్టిస్టేతరులు ఆస్తులను అన్యాక్రాంతం చేసేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. భీమిలి బాప్టిస్టు చర్చి ఎదురుగా ఉన్న స్థలం, విజయనగరంలోని సీబీఎం యూపీ స్కూల్, బొబ్బిలి సీబీసీఎం బాలిక హైస్కూల్ స్థలాల ఆక్రమణకు పాల్పడిన రత్నకుమార్‌ను కరస్పాండెంట్ పదవి నుంచి తొలగించామని చెప్పారు. అదేవిధంగా నౌపడా, కోటబొమ్మాళి స్కూల్స్ స్థలాలను యాకబ్ కబ్జా చేయాలని చూశాడని, దీంతో ఆయనను సంస్థ కన్వీనర్‌గా తొలగించామని పేర్కొన్నారు. అందువలన వారిపై తక్షణమే సీఐడీ కేసు వేసి దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

వానరాల బెడద


- తూముకొండలో వందల సంఖ్యలో సంచారం
- పట్టించుకోని అటవీశాఖ అధికారులు



గ్రామంలో సంచరిసున్న కోతులు

మెళియాపుట్టి: మండలంలోని పరశురాంపురం పంచాయతీ పరిధి తూముకొండ, రామచంద్రాపురం తదితర గ్రామాల్లో వందల సంఖ్యలో వానరాలు సంచరిస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. హఠాత్తుగా అధిక సంఖ్యలో కోతులు కనబడడంతో ఎవరో వాహనంపై తీసుకొచ్చి విడిచిపెట్టినట్లు గ్రామస్తులు అనుమానిస్తున్నారు. చిన్న చిన్న కోతి పిల్లలకు కొంతమంది స్థానికులు ఆహారం అందిస్తున్నారు. అయితే ఇళ్లల్లోకి వస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయని వాపోతున్నారు. అలాగే పోడు వ్యవసాయ పంటలు, కూరగాయల పంటలు నాశనం చేస్తున్నాయని చెబుతున్నారు. అదేవిధంగా జీడిమామిడి తోటల్లో సంచరిస్తూ పువ్వు, పిందెలను రాల్చుతూ ఇబ్బంది పెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పిల్లలపై దాడులు చేస్తాయేమోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. అటవీ శాఖ అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



రెండు నెలల క్రితం అకస్మాత్తుగా వందల సంఖ్యలో కోతులు మా గ్రామ పంచాయతీలో కనిపించాయి. ఎలా వచ్చాయో.. ఎవరు తెచ్చి విడిచిపెట్టారో తెలీదు. అప్పుడే ఫారెస్ట్ అధికారులు, స్థానిక తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాం. అయినా పట్టించుకున్న దాఖలాలు లేవు. నా సొంత ఖర్చుతో బోను తయారు చేయిస్తున్నాను. అధికారులు సహకరించాలి. – తెంబూరు ప్రసాదరావు, సర్పంచ్, పరశురాంపురం



ఒక ఇంటి వద్ద నీరు తాగుతున్న వానరాలు

మహేంద్రం.. జనసంద్రం

మహా శివరాత్రి పర్వదిన పురస్కరించుకొని మహేంద్రగిరి జనసంద్రమైంది. మంగళవారం అర్ధరాత్రి నుంచే కొండపై పంచాక్షరి మంత్రం మార్మోగింది. ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు పూజలు చేసేందుకు తరలి వెళ్లారు. ఇక్కడ పంచ పాండవుల ఆలయాలు, కుంతి ఆలయాన్ని భక్తులు సందర్శించారు. ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం యాత్రికుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. – మందస/కాశీబుగ్గ

